# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ పారిశ్రామిక పాలసీల్లో సవరణతో పాటు పలు నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని మంత్రి కొలుసు పార్థ సారధి వెల్లడించారు.
- ❖ పార్వతీపురం మన్యం జిల్లాలో వన్ ధన్ వికాస కేంద్రాల (వీడీవీకే) కార్యకలాపాలను మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అధికంగా 35 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

==========================

రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు బాబు నాయుడు పేర్కొన్నారు. ఈరోజు మంత్రి వర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి మంత్రులతో మాట్లాడుతూ.... వచ్చే మూడు నెలలు జనంలోకి వెళ్లే పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. మత్స్యకార భరోసా ఇవ్వడంపై దృష్టి పెట్టాలని మంత్రులకు సూచించారు. అన్నదాత సుఖీభవకు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాలను వేగవంతం చేసేలా కలెక్టర్లు, విద్యుత్ ఎస్ఈలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా 7.5 లక్షల ఉద్యోగాల హామీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా డీఎస్సీ నియామకాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భూముల నకిలీ రిజిస్ట్రేషన్లను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

==========================

వెనుకబడిన తరగతులకు చెందిన మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వ పాలసీల్లో సవరణలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. ఈరోజు అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో కేబినెట్ తీసుకున్న పలు నిర్ణయాలను మంత్రి వెల్లడించారు. పారిశ్రామిక వేత్తలకు విద్యుత్ సహా పలు విభాగాల్లో ప్రత్యేక రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. టీటీడీలో పోటు కార్మికులకు సంబంధించిన 15 పర్యవేక్షణ నియామకాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

=========================

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని APSPDCL ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.చంద్రశేఖర్ రావు కోరారు. ఈరోజు తిరుపతిలోని APSPDCL కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... రాయితీతో గృహవినియోగదారులు తమ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునని. దీనితో విద్యుత్ బిల్లులు తగ్గుతాయని అన్నారు. www.pmsuryaghar.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ పథకానికి ధరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈనెల 8, 9 వ తేదీల్లో పిఎం సూర్యఘర్ పథకంపై తిరుపతిలోని రాఘువేంద్ర నగర్ లో ఉన్న APSPDCL సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో రెండు రోజుల పాటు అవగాహనా మేళాను నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

=========================

ఇటీవల కాలంలో కొబ్బరి రైతులకు అంతర పంటల సేద్యం లాభదాయకంగా మారిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అన్నారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారంలో ఓరైతు కు చెందిన కొబ్బరి తోటలలో కోకో అరటి అంతర పంటల సాగును, కో కో సోలార్ డ్రైయింగ్ యూనిట్ పరిశ్రమను ఈరోజు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కొబ్బరి ఉద్యాన తోటల్లో సైతం ఏదో ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు చేస్తేనే రైతులకు వ్యవసాయం గిట్టుబాటవుతుందన్నారు. కొబ్బరి తోటల్లో పాక్షిక నీడ వల్ల ఏర్పడే చల్లని వాతావరణం కోకో సుగంధ ద్రవ్య పంటలకు ఎంతో అనువైనదన్నారు. సుగంధ ద్రవ్య పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ, నేరుగా మార్కెటింగ్ చేసుకుంటూ లాభాలను ఆర్జించాలని సూచించారు.

విరామం

=========================

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రధానమంత్రి వన్ ధన్ వికాస కేంద్రాల (వీడీవీకే) కార్యకలాపాలను మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో వీడీవీకేలపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న వీడివికెలు అటవీ ప్రాంతంలో లభించే చీపుర్లు, చింతపండు, పసుపు, జీడిపప్పు, వంటి వివిధ రకాల సరుకులను ఉత్పత్తి చేస్తున్నాయన్నారు. నాణ్యమైన ఉత్పత్తులకు, బ్రాండింగ్, ప్యాకింగ్‌తో పాటు మంచి మార్కెటింగ్ సదుపాయం అందించడం ఎంతో అవసరం అన్నారు. ఈ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న ఆది మహోత్సవాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

=========================

ప్రముఖ వైద్యులు డాక్టర్ మారు ఈ రోజు మధ్యాహ్నం విజయవాడలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. డాక్టర్ మారు సామాజిక సేవకులు, నాస్తికోద్యమ నాయకులైన గోరా - సరస్వతీ గోరాల కుమార్తె, డాక్టర్ సమరం సోదరి. డాక్టర్ మారు అనేక గ్రామాల్లోనూ, గిరిజన ప్రాంతాల్లోనూ సేవలందించడమే కాకుండా మూఢనమ్మకాల నిర్మూలనకి ఎంతో కృషి చేసారు. ఉచిత పోలియో శస్త్ర చికిత్సలు, శుక్లాల ఆపరేషన్లు చేయించడంలోనూ, అలాగే అనేక

మందికి నర్సింగ్ శిక్షణ ఉచితంగా అందించడంలోనూ ఆమె ప్రముఖ పాత్ర వహించారు. ఆమె మృతి పట్ల అభిమానులు, వైద్యసేవలు పొందినవారు, వైద్యులు నివాళులర్పించారు. డాక్టర్ మారు అంతిమయాత్ర రేపు మధ్యాహ్నం 3 గంటలకి విజయవాడ నాస్తిక కేంద్రంలో ప్రారంభం అవుతుందని నాస్తిక కేంద్రం తెలియచేసింది.

==========================

రాష్ట్ర వ్యాప్తంగా అధిక  ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో 35 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈరోజు కర్నూలు జిల్లా సి.బెలగళ్, సత్యసాయి జిల్లా కొత్త చెరువు, నంద్యాల, కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్, ప్రకాశం జిల్లా కనిగిలో 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ప్రొద్దుటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, కోనసీమ జిల్లా కపిలేశ్వరంలో 35.8 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 35.7, ఏలూరు, కాకినాడలో 35.6, విజయనగరంలో 35.5, మన్యం జిల్లా జియ్యమ్మవలసలో 35.7, బాపట్ల, తణుకులో 35.5, శ్రీకాకుళం జిల్లా పొందూరులో 35.4, తిరుపతి జిల్లా రేణిగుంటలో 35.53, పల్నాడు జిల్లా మాచర్లలో 35.4, చిత్తూరు జిల్లా నగరిలో 35.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలియజేశారు.

==========================

తూర్పు, పశ్చిమ గోదావరి ద్వై వార్షిక పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల  ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు నోడల్ అధికారులు ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు  మేరకు పనిచేయాలని డిఆర్ఓ, సహాయ ఎన్నికల అధికారి టి. సీతారామమూర్తి సూచించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 27న పోలింగ్ కు సంబంధించి ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లాలో 92 పోలింగు కేంద్రాల పరిధిలో 63 వేల 441 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు.  ప్రతి పోలింగ్ కేంద్రంలో 750 నుంచి 1000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే ఏర్పాట్లు చేశామన్నారు.

==========================

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో దృశ్యమాధ్యమం ద్వారా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను గుర్తించి వాటి స్థితిగతులకు సంబంధించి వివరాలను సేకరించాలని అన్నారు.  ఈనెల 01 నుండి మార్చి 15 వరకు జరుగుతున్న సర్వేలో బోర్ వెల్స్, చేతి పంపుల నిర్వహణ పూర్తి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికను అందజేయలని కలెక్టర్ ఆదేశించారు.

==========================

==========================